క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే గణేష్



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. - నర్సీపట్నం

ఈర్లె అనురాధకు మహిళా నేతల సత్కారం



వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోన్-1 వర్కింగ్ ప్రెసిడెంట్ అనురాధను సత్కరిస్తున్న దృశ్యం

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోన్-1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధను స్థానిక వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోన్-1 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అనురాధను దేవరాపల్లి మండలానికి చెందిన పలువురు మహిళా నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ దేవరాపల్లి మండల మహిళా అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, జిల్లా మహిళా విభాగం కార్యవర్గ సభ్యురాలు వేచలపు వాణి, అల్లు జగదీశ్వరి పాల్గొన్నారు.

29న అక్షరపూజలు, అక్షరాభ్యాసాలు

రోలుగుంట : ఈ నెల 29 న అక్షర పూజలు, అక్షరాభ్యాసాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు బాబూరావు మాస్టారు తెలిపారు. బుధవారం రోలుగుంట వచ్చినాయన తన ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో పెద బొడ్డేపల్లి శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రుల గురించి మాట్లాడారు. ఈ నెల 22 న ప్రారంభమైన ఈ ఉత్సవ కార్యక్రమాలు ఈ నెల 29 సరస్వతి అవతారం రోజున అక్షర పూజలు, అక్షరాభ్యాసాలతో ముగుస్తాయన్నారు. ఆ రోజు ఉదయం 5 గంటలు ప్రత్యేక అభిషేకం, 7 గంటలకు కుంకుమ పూజలు, 8 గంటలకు అక్షర పూజలు. అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు రెండు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు

నాతవరం : మండలంలో గురువారం గుమ్మడిగొండ నాతవరం సచివాలయం -1లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. అయా గ్రామాల్లో ప్రజలు తమ ఆధార్ కార్డులలో తప్పు ఒప్పులుంటే సరి చేసుకోవాలని తెలియజేసారు, మరల ఆధార్ క్యాంపులు ఎప్పుడు ఏర్పాటు చేస్తామనేది తెలియదని అందుచేత ఆధార్ కార్డులో లోపాలు ఉన్నవాలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి 104 సేవలు ప్రారంభం

మాకవరపాలెం: మండల కేంద్రంలో గురువా రం నుంచి నిర్వహించే 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అల్లంపల్లి శిరీస కోరారు. ఇప్పటివరకు 104 సేవలు అందక పోవడంతో మండల కేంద్రంలో కూడా సేవలు అందించాలని వైద్యశాఖను కోరామన్నారు. ప్రతి గురువారం అంబేడ్కర్ కాలనీలో 104 సేవలు అందించేందుకు నిర్ణయించినట్టు చెప్పారు.

కాలినడకన విజయవాడకు..



లింగంపేట నుండి విజయవాడ వెళుతున్న భవానీ భక్తులు

గొలుగొండ: లింగంపేట నుండి విజయవాడకు సుమారుగా పది మంది భవానీ భక్తులు బుధవారం కాలినడనక బయలుదేరారు. గ్రామంలో వీరంతా నెలరోజులు నుంచి భవానీ మాలలు ధరించి ఇక్కడే దీక్షలు చేసి నవరాత్రులు సందర్భంగా విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోవడం కోసం కాలినడకన పయనమయ్యారు. ఈ సందర్భంగా గురి స్వామి కర్రి గణేష్ మాట్లాడుతూ ఐదు రోజులు వ్యవధితో విజయవాడ చేరుకుంటామని తెలిపారు.

రైతు మహాజన సభ

రావికమతం : కొత్తకోట పీఏసీఎస్ అధ్యక్షుడు పి.వి.ఎస్.ఎన్ రాజు ఆధ్వర్యంలో కొత్తకోట ప్రాథమిక సహకార సంఘం వద్ద బుధవారం రైతు మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సహకార సొసైటీ పరిధిలోని మహిళలకు జాయింట్ లైవలిటీ గ్రూపుల ద్వారా స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన సాధించేలా సులభ వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించేలా విరివిగా రుణాలు అందిస్తామని చెప్పారు.

పంటపొలాల్లో కిష్కింధకాండ



గ్రామాల్లో వన్యప్రాణులు విచ్చల విడిగా సంచరిస్తూ పంట పొలాలను, ఉద్యాన పంటలను నాశనం చేస్తున్నాయి. కోతులు, అడవిపందులు పంటపొలాల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ వరి పంటతో పాటు చెరకు, ఇతర వాణిజ్య పంటలు, కూరగాయలు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. కోతులు కొబ్బరి చెట్లు ఎక్కి, పిందెలు మూతులు కొరికి పడేస్తున్నాయి. సీజన్‌లో బొప్పాయి, మామిడి, చింత చెట్లు ఎక్కి కాయలు రాల్చేస్తున్నాయి. కూరగాయలు పంటలు కూడా కోతులు, అడవి పందులు భోంచేస్తున్నాయి. దీంతో పంటలు ఎలా కాపాడుకోవాలంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

- కోతుల గుంపుతో చెరకుతోటలు, కొబ్బరి చెట్లు ధ్వంసం
- పొలం గట్లను తవ్వేస్తున్న అడవి పందులు
- కాపాడాలంటూ అధికారులకు రైతుల వేడుకోలు
- పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం, అటవీ అధికారులు



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న కోతుల మూక



కె.జె.పురం తాచేరు పక్కన తోటల్లో సంచరిస్తున్న అడవి పంది

మాడుగుల రూరల్ : ప్రధానంగా మాడుగుల మండలం కె.జె.పురం గ్రామంలో కోతుల స్వైర విహారం ఎక్కువగా ఉంది. దబ్బకుంటు రహదారిలో కోతులు మహిళలను, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కళ్లం పాకల వద్ద కోతుల గుంపు తిష్ట వేసి, రైతులను పశువులును భయభ్రాంతులుకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా పొలాల్లోకి మధ్యాహ్న భోజనాలు తట్టలతో తీసుకెళ్తున్న మహిళలపైనా దాడులు చేస్తున్నాయి. ద్విచక్రవాహనాలు, సైకిల్ మీద ప్రయాణం చేసే వారి మీదా ఆహారం కోసం కోతులు దాడి చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా రోడ్లు మీదకు బయలుదేరి జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. తాచేరు నదీ పరివాహక ప్రాంతంలోనూ, ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో కోతులు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. కోతులు దుకాణల్లో సరుకులు ఎత్తుకెళ్లడంతో పాటు ఇళ్లలోనూ చొరబడుతున్నాయని ఘాట్‌రోడ్డు వర్తక సంఘం అధ్యక్షుడు కోట్ని సత్యం బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సురవరం, సాగరం, తాటిపర్తి, కాశీపురం, గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో కూడా చొరబడి విద్యార్థినులను బెంబేలెత్తిస్తున్నాయి.

అడవిపందుల బారిన చెరకు తోటలు

స్వల్పంగా రైతులు పండిస్తున్న చెరకు తోటలు అడవి పందులు నాశనం చేస్తున్నాయి. కె.జె.పురం దబ్బకుంటు రహదారిలో తాచేరు నది పక్క నుంచి పంట పొలాల్లకి చొరబడి చెరకు తోటలు విరిచేస్తున్నాయి. వరి పొలాల గట్ల మీద ఉన్న సీమ దుంపల కోసం గట్లు పళ్లతో కుళ్లబొడిచి ధ్వంసం చేస్తున్నాయి. దీని వల్ల రై పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా గట్ల మీద నుంచి వృధాగా పోతోంది. వన్య ప్రాణులను చంపవద్దని అటవీ అధికారులు సూచిస్తున్నారు. గతంలో అడవి పందిని సంహరించారని ఒక రైతు మీద అటవీశాఖ అధికారులు కేసులు పెట్టిన సంఘటన కూడా ఉంది. కోతులు, అడవి పందులు నుంచి రైతులను కాపాడాలని కోరతు ఈ ఏడాది జూలై 4 వ తేదీన అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్‌లో కేజేపురానికి చెందిన సర్వేజనా సుఖినోభవంతు సేవా సంస్థ జిల్లా మేధా అభ్యుదయ సమితి అధ్యక్షుడు పెంటకోట జగదీష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదే నెల 8 వ తేదీన కోతులను సురక్షితంగా పట్టివేసి, రిజర్వు ఫారెస్టులో విడిచిపెట్టాలని జిల్లా ఫారెస్టు అధికారి చోడవరం రేంజర్ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. చోడవరం రేంజర్ అధికారి కె.జె.పురం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఈ విషయం తెలియపరిచారు. అయితే దీనిపై చర్యలు తీసుకోవాల్సిన ఫారెస్టు అధికారులే పంచాయితీ అధికారులకు తెలియపర్చడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫారెస్టు అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శిస్తున్నారు. ఇప్పటికే నష్టాల పాలైన రైతులకు వన్యప్రాణుల వల్ల మరింత హాని జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో కళ్లం పాకల వద్ద కూడా ఎవరూ ఉండడం లేదు. దీంతో పశువులను అడవి పందులు గాయపరుస్తున్నాయి.



కె.జె.పురంలో అడవి పందులు ధ్వంసం చేసిన పొలం గట్లు

పంటలు నాశనం



పంట పొలాలు పూర్తిగా నాశనం చేస్తున్నాయి. ఉద్యానవన పంటలను ధ్వంసం చేస్తున్న కోతుల బారి నుంచి కాపాడాలి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. కె.జె.పురం దబ్బకుంటు రహదారి పొలాల్లో ఒంటరిగా వెళ్లే మహిళల మీద కూడా వన్యప్రాణులు దాడులు చేస్తున్నాయి. పలువురు మహిళలు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఫారెస్టు అధికారులు స్పందించాలి.

– యల్లపు పెంటయ్య , గ్రామస్తులు, కె.జె.పురం గ్రామము, మాడుగుల మండలం

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు..



అడవి పందులు, కోతుల వల్ల కలుగుతున్న ఇబ్బందులపై ఈ ఏడాది జూలై 4న అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశాను. ఈ మేరకు అదే నెల 8న జిల్లా ఫారెస్టు అధికారికి తగు చర్య నిమిత్తం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పంపించారు. కానీ నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వన్య ప్రాణుల నుంచి ప్రజలను కాపాడడంలో ఫారెస్టు అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. గ్రామ పంచాయతీకి ప్రతిపాదించారు. పంచాయతీ వారు కోతులను నిర్మూలించలేరు. ఫారెస్టు అధికారులే చర్యలు తీసుకోవాలి.

– పి. జగదీశ్, సర్వేజనా సుఖినోభవంతు సేవా సంస్థ అధ్యక్షుడు, మాడుగుల మండలం

పాడి పశువులనూ కరిచేస్తున్నాయి...



ప్రతి రోజు పంట పొలాలు ధ్వంసం చేయడంతో పాటు కోతులు, అడవి పందులు దాడి చేసి పశువులను కరిచి గాయపరుస్తున్నాయి. కళ్లం పాకల వద్ద రాత్రి వేళ రైతులు లేని సమయంలో గాయపర్చడం వల్ల గేదె పెయ్యిలు, ఆవు పెయ్యిలు చనిపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించాలి.

– పెంటకోట మాలినాయుడు, రైతు, కె.జె.పురం, మాడుగుల మండలం

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం కావాలి



శిక్షణలో మాట్లాడుతున్న డిఎల్‌డివో నాగలక్ష్మి



మాడుగుల : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్

మాకవరపాలెం : పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి నాగలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మాకవరపాలెం, కోటవురట్ల మండలాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీపీలకు సుస్థిర లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న వనరులతో అభివృద్ధి సాధనపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సర్వేశ్వరరావు, ఎంపీడీవో చాయాసుధ, డిప్యూటీ ఎంపీడీవో మేరీజోన్స్ పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు , పంచాయతీ కార్యదర్శులకు బుధవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ 2025, 2026కు సంబంధించి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల, కార్యాచరణపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు ఈ కార్యక్రమాలపై అవగాహన పెంచుకుని గ్రామాభివృద్ధికి వనరులు సమకూర్చుకోవాలన్నారు.

నాతవరం: శిక్షణ తరగతుల్లో చెప్పిన విషయాలు విధిగా గ్రామ పంచాయతీలో అమలు చేసే బాధ్య పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు, మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీలు అభివృద్ధిపై ప్రభుత్వం నుంచి వచ్చిన విధి విధానాలపై వివరించారు. అనంతరం గ్రామ పంచాయతీలు అభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ కోఆర్డినేటరు బత్తుల రమేష్ తెలియజేశారు.

అన్నపూర్ణదేవి అవతారంలో దుర్గమ్మ



అన్నపూర్ణదేవిగా దుర్గాదేవి



మాడుగుల దేవీ ఆలయంలో బొమ్మల కొలువు

నర్సీపట్నం : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో మూడో రోజు బుధవారం శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.పట్టణానికి చెందిన నాయకులు మోహన్ అమ్మవారి ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

రావికమతం: కొత్తకోటలోని దుర్గాదేవి ఆలయంలో బుధవారం అన్నపూర్ణ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు వేపా రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుచ్చెయ్యపేట : సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారిని బుధవారం అన్నపూర్ణదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పలు గ్రామాల్లో దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మాడుగుల/మాడుగుల రూరల్: : శరన్న నవరాత్రి ఉత్సావాలులో బాగంగా బుధవారం మాడుగులలో వెలసిన దేవీతల్లీ, దుర్గాలమ్మ అమ్మవారులు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులుకు దర్శనమిచ్చారు. దేవీ ఆలయ మండపంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. వంటర్లపాలెంలో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బుధవారం అన్నపూర్ణదేవిగా అలంకరించారు.

చెరువును పరిరక్షించాలని వినతి

మాకవరపాలెం: చెరువు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాలని తహసీల్దార్ వెంకటరమణకు రైతులు విన్నవించారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 171 లో 8.58 ఎకరాల విస్తీర్ణంలోఉన్న కవిశెట్టివాని చెరువును ఆక్రమిస్తున్నారని రుత్తల నాని, రైతులు బుధవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చెరువు గర్భాన్ని కొందరు ఆక్రమిస్తున్నారని తెలిపారు. దీనిని ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లాలం రాము ఉన్నారు.

శత శాతం ఫలితాలు సాధించాలి



కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐవో వినోద్‌బాబు

రావికమతం: శత శాతం ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులకు బోధన అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి ఎం వినోద్‌బాబు అన్నారు. మండలంలో కొత్తకోట జూనియర్ కళాశాలను బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులు విద్యార్థులకు విధిగా వారాంతపు పరీక్షలు నిర్వహించాలని, నీట్, ఎంసెట్, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేలా విద్యార్థులకు ఉత్తమ బోధన అందిచాలని సూచించారు. అనతరం తరగతి గదులు పరిశీలించారు. కళాశాల ఆవరణలో అధ్యాపకులు కలిసి మొక్కలు నాటారు.

మహిళలకు వైద్య పరీక్షలు



బాలింతలకు రొట్టెలు అందిస్తున్న దృశ్యం



కింతాడలో మహిళలకు ఆరోగ్య పరీక్షలను చేస్తున్న వైద్యాధికారి మాదంనాయుడు

గొలుగొండ : మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు. కొత్తమల్లంపేట గ్రామంలో స్వస్థనారీ శక్తి అభియాన్ కార్యక్రమం బుదవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు,గర్భిణులు, కిశోర బాలికలకు ప్రత్యేక వైద్యశిభిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సాంబమూర్తి, టీడీపీ మండల మాజీ పార్టీ అధ్యక్షుడు అప్పలనాయుడు, రాష్ట్ర బీజేపీ నాయకులు గాదె శ్రీనివాసరావుతో పాటు అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : మహిళల్లో కలిగే అనారోగ్య సమస్యలకు ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యం సకాలంలో పొందాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి మాదంనాయుడు అన్నారు. కింతాడలో బుధవారం స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆరోగ్య పరీక్షలను జరిపారు. 169 మందికి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



చౌడువాడలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ అధికారి లలితకుమారి

కె.కోటపాడు : పుట్టిన అరగంట వ్యవధిలోనే తల్లి పాలను బిడ్డకు అందించాలని బాలింతలకు, గర్భిణులకు కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి లలితకుమారి తెలిపారు. చౌడువాడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ మాసోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు పోషక విలువలు గల ఆహారం తీసుకోవడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే అనుబంధ ఆహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ధర్మవరంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం



జోష్ మిషన్ టెక్నో స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ పైల రాజు, జెడ్పీటీసీ ఆదిమూర్తి

రావికమతం: మారు మూల ప్రాంతంలో పేదలకు పలు సేవలు అందించడం అభినందనీయమని రావికమతం మండల ఎంపీపీ పైల రాజు, ప్రొటోకాల్ జెడ్పీటీసీ తలారి ఆదిమూర్తి అన్నారు. మండలంలో ధర్మవరం గ్రామంలో ఫాదర్ కె.వర్గీష్ నిర్మించిన జోష్ మిషన్ టెక్నో స్కూల్(ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రం)ను బుధవారం ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నిర్వాహకులను అభినందించారు. ఫాదర్ వర్గీష్ మాట్లాడుతూ ఉచిత శిక్షణ కేంద్రం పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, సర్పంచ్ రాజ్యలక్ష్మి, లోవరాజు, గంగరాజు, ఎంపీటీసీ సభ్యులు పూడి దేవ, పైల చిన్నమ్ములు, ఉప సర్పంచ్ సింహాచలం, వైకాపా నాయకులు శీలం శంకర్, రమణబాబు, తెదేపా మండల అధ్యక్షుడు శంకర్, మాజీ అధ్యక్షుడు కొండనాయుడు పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్, మాజీ మంత్రి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు



పీవో ఎర్రయ్యమ్మ

మాడుగుల: కార్పొరేట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు మార్పు చేయడానికి ప్రతి కార్యకర్త, ఆయాలు అంకితభావంతో పని చేయాలని మాడుగుల ఐసీడీఎస్ సీడీపీవో జి.ఎర్రయ్యమ్మ అన్నారు. బుధవారం మాడుగుల ప్రాజెక్టు కార్యాలయంలో సాక్షితో ఆమె మాట్లాడారు అంగన్‌వాడీలో అందిస్తున్న పథకాలు గర్భిణులు, 3 ఏళ్ళ నుంచి ఆరేళ్లలోపు పున్న విద్యార్థులకు కేంద్రాల్లోనే పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామన్నారు. మాడుగుల ప్రాజెక్టు పరిధిలో 156 అంగన్‌వాడీ కేంద్రాలుండగా మాడుగుల మండలంలో 97 కేంద్రాలున్నాయన్నారు. 156 కేంద్రాల్లో సుమారు 2017 మందికి పైగా చిన్నారులు ఉన్నారన్నారు. అంగన్‌వాడీలో మంచి పౌష్టికాహారంతో పాటు, బొమ్మలు, ఆటలతో కూడిన విద్య అందిస్తున్నామన్నారు. సూపర్‌వైజర్‌లు పి.చిన్నమ్మలు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

జీవన ఎరువులు వాడండి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత నాగేంద్ర, వ్యవసాయశాఖ ఏడీ ఉమాప్రసాద్

నాతవరం : రైతులంతా జీవన ఎరువులు వాడకంపై దృష్టి సారించాలని వ్యవసాయ పరిశోధన అధికారి బీసీటీ శాస్త్రవేత బి.నాగేంద్ర అన్నారు. ఎస్.బి.పట్నంలో బుధవారం పాయకరావుపేట వ్యవసాయశాఖ ఏడీ ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ ఆత్మ సంయుక్తంగా రైతులకు జీవన ఎరువులు వాడకంపై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం కాలక్రమేణా తగ్గుతుందన్నారు. మళ్లీ పెంపొందించడానికి పలు రకాల జీవన ఎరువులు కచ్చితంగా వాడాలన్నారు.

మాకవరపాలెం: డ్రోన్ల ద్వారా యూరియా పిచికారీ చేస్తూ సమయాన్ని ఆదా చేసుకోవచ్చని ఏవో అప్పారావు రైతులకు సూచించారు. ఎం.నగరంలో ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ నానో యూరియా పంటలకు పిచికారీ చేయడం వల్ల నేల, వాయు కాలుష్యం తగ్గుతుందన్నారు. 80 శాతం రాయితీపై డ్రోన్లు అందజేస్తున్నామని అన్నారు.

కె.కోటపాడు : సాగు భూమి బురదపదునుగా ఉన్న సమయాల్లోనే ఎరువులను పంటకు అందించాలని మండల వ్యవసాయాధికారి ఎం.వి.సోమశేఖర్ తెలిపారు. కె.కోటపాడులో బుధవారం ఆయన రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న సమయంలో నీరు తగ్గిన తరువాత పంట బురద పదునుగా ఉన్న సమయంలో ఏ ఎరువు అయినా పంట కుదుళ్ళు నుంచి మొక్కకు పోషకాలు అందుతాయన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియాను ఎకరాకు 500 ఎంఎల్‌ను పిచికారి చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలి

కె.కోటపాడు : విద్యార్థులు సేవా భావాన్ని అలవాటు చేసుకోవాలని అయ్యన్న విద్యాసంస్థల డైరక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే సందర్భంగా బుధవారం అయ్యన్న కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్‌డేను పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఖాసిమ్‌తో పాటు పలువురు యువకులు రక్తదానం చేశారు.

మాడుగుల : విద్యార్థి దశ నుండి సేవా భావం అలవర్చుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వి.ఎస్.ఎస్ శాస్త్రి తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు ఎన్ఎస్ఎస్‌లో చేరడం వల్ల దేశభక్తి, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

203 మందికి వైద్య పరీక్షలు



రైవాడలో వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్య మేఘన



ఆయుర్వేద వైద్య సేవలందిస్తున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి గ్రీష్మ

దేవరాపల్లి: మండలంలోని రైవాడలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్య మేఘన, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి జి. గ్రీష్మ వైద్య సేవలందించారు. ఈ వైద్య శిబిరంలో 203 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.